సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం, 1, జూలై, 2023

I



చీనీ టన్ను రూ.23 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్టధర రూ.23వేలు పలికాయి. మార్కెట్‌కు 747 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ప్రొఫెసర్.. సేవలు సూపర్
హిందూపురం ఎస్‌డీజీఎస్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కుమార్ రాజా కుటుంబీకులతో కలిసి ట్రినిటి ట్రస్టు ద్వారా పేదలకు విశేష సేవలందిస్తున్నారు. IIలో

గరిష్టం/కనిష్టం
35.9°/22.7°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో మరింత తగ్గిన నీరు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)లో నీటిమట్టం మరింత దిగువకు పడిపోయింది. ఎగువన కర్ణాటక ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో నీటి చేరిక పూర్తిగా ఆగిపోయింది. గత ఏడాది డ్యాంలో ఇదే సమయానికి 1613.61 టీఎంసీల అడుగుల నీటిమట్టంతో 45.202 టీఎంసీల నీరు నిల్వ ఉండి, ఇన్‌ఫ్లో 4,434 కూసెక్కులు, అవుట్‌ఫ్లో 295 క్యూసెక్కులు ఉండేది. ప్రస్తుతం శుక్రవారం నాటికి 3.295 టీఎంసీల నీటి నిల్వతో అవుట్‌ఫ్లో 295 క్యూసెక్కులు నమోదైంది.

పింఛన్ కానుకకు రూ.72.75 కోట్లు



పుట్టపర్తి అర్బన్: ఏ ఆసరాలేని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, నేతన్న, డప్పు కార్మికులు, చర్మకారులు తదితరులకు ఇచ్చే 'వైఎస్సార్ పింఛన్ కానుక' కోసం ప్రభుత్వం రూ.72,75,83,500 విడుదల చేసింది. జిల్లాలో 2,62,181 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, వారందరికీ శనివారమే పింఛన్ మొత్తం పంపిణీ చేసేందుకు వలంటీర్లు సిద్ధమయ్యారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రమే సచివాలయాల సిబ్బంది నగదు మొత్తాన్ని బ్యాంకుల నుంచి డ్రా చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. జిల్లాలో 100 శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు మృత్యువాత




మృతులు షేక్ మహమ్మద్, నబీరసూల్

గుమ్మఘట్ట: ఈత సరదా ఇద్దరిని బలిగొంది. నీటమునిగిన యువకుడు తనను రక్షించబోయిన స్నేహితుడిని భయంతో గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ ఊపిరాడక ప్రాణం విడిచారు. ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. రాయదుర్గానికి చెందిన షేక్ మహమ్మద్ (22) పిండి మిషన్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. బళ్లారిలో టైలరింగ్ పనిచేసుకుంటున్న నబీరసూల్(23) ఇతనికి స్నేహితుడు. బక్రీద్ పండుగ కోసం నబీరసూల్ రాయదుర్గంలోని స్నేహితుడి ఇంటికి వచ్చాడు. శుక్రవారం గుమ్మఘట్ట మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్ట్ చూసి.. సరదాగా నీటిలో ఈత కొడదామని షేక్ మహమ్మద్, నబీరసూల్, స్నేహితులు సోఫిద్, మహమ్మద్, ముజీబ్, వడ్డే బాబుతో కలిసి భోజన క్యారియర్లు తీసుకుని ద్విచక్రవాహనాలపై వెళ్లారు. ఈత రాని నబీరసూల్ అక్కడ నీటిని చూసి సరదాగా దిగాడు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోవడాన్ని గమనించిన షేక్ మహమ్మద్ స్నేహితుడిని రక్షించేందుకని దూకాడు. అయితే నబీరసూల్ భయంతో మహమ్మద్‌ను గట్టిగా పట్టుకున్నాడు. మహమ్మద్‌కు ఈతకొట్టే అవకాశం లేక నబీరసూల్‌తో పాటే నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందారు. తోటి స్నేహితులు రక్షించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. మృతదేహాలను వెలికితీశాక అక్కడికి చేరుకున్న ఇరు కుటుంబాల సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మహ్మద్, నబీరసూల్‌లకు వివాహం కాలేదు. సమాచారం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి సంఘటన స్థలానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూరల్ సీఐ యుగంధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సేవలు శాశ్వతం



మడకశిరలో ఒకే ప్రాంగణంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం,వైఎస్సార్ విలేజ్ క్లినిక్, గ్రామ సచివాలయ భవనాలు

ఓ వైపు గ్రామ సచివాలయం.. మరోవైపు రైతు భరోసా కేంద్రం... ఆ పక్కనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్.. నాలుగు అడుగులు ముందుకేస్తే డిజిటల్ లైబ్రరీ భవనం..ఇలా పల్లెవాసులకు సకల సేవలు అందించే కార్యాలయాలకు శాశ్వత భవనాలు సమకూరుతున్నాయి. సౌకర్యాలు మెరుగుపడటంతో ఉద్యోగులు వేగవంతంగా సేవలందిస్తున్నారు. ఫలితంగా పల్లెవాసులకు స్థానికంగానే ప్రభుత్వ సేవలన్నీ వేగవంతంగా అందుతున్నాయి.

- సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలకు శాశ్వత భవనాలు
- ప్రభుత్వ సేవలన్నీ పల్లెల్లోనే అందుబాటులోకి
- గ్రామ స్వరాజ్యం సాకారం

సాక్షి, పుట్టపర్తి: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ సేవలన్నీ పల్లెల్లోనే అందేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేశారు. వాటికి శాశ్వత భవనాలు మంజూరు చేశారు. సచివాలయాల ద్వారా 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సుమారు ఐదు వందల సేవలను ప్రజలకు అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారు. దీంతో మండల, జిల్లా కేంద్రాలకు పరిగెత్తే పనిలేకుండా స్వగ్రామాల్లోనే సేవలు అందుతుండటంతో పల్లెజనం ఆనందపడుతున్నారు.

శరవేగంగా నిర్మాణం..

జిల్లాకు 420 సచివాలయాలు, 389 రైతు భరోసా కేంద్రాలు, 293 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, 189 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు మంజూరయ్యాయి. నిర్దేశించిన ప్రాంతాల్లో భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల నిర్మాణం పూర్తయి సేవలకు అందుబాటులోకి వచ్చాయి. వివిధ పథకాల లబ్ధిదారులతో పాటు రైతులకు ప్రభుత్వ సేవలన్నీ స్థానికంగానే అందుతున్నాయి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి వస్తున్నాయి. ఫలితంగా ఉద్యోగులు కూడా ఎలాంటి అసౌకర్యం లేకుండా వేగవంతంగా పనులు చేస్తున్నారు.




వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	293
ప్రారంభం కావాల్సినవి	85
బేస్‌మెంట్ లెవెల్ పూర్తి	123
నిర్మాణం పూర్తయినవి	85



గ్రామ సచివాలయాలు	420
ప్రారంభం కావాల్సినవి	32
బేస్‌మెంట్ లెవెల్ పూర్తి	196
నిర్మాణం పూర్తయినవి	192



రైతు భరోసా కేంద్రాలు	389
ప్రారంభం కావాల్సినవి	91
బేస్‌మెంట్ లెవెల్ పూర్తి	136
నిర్మాణం పూర్తయినవి	162



వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు	189
ప్రారంభం కావాల్సినవి	175
బేస్‌మెంట్ లెవెల్ పూర్తి	11
నిర్మాణం పూర్తయినవి	3

సేవలన్నీ ఊర్లోనే అందుతున్నాయి



గతంలో ఏదైనా పని పడితే 15 కి.మీ దూరంలోని మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు స్థానికంగా ఉండటంతో ప్రభుత్వ సేవలన్నీ ఇంట ముంగిటకే వస్తున్నాయి. ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా ప్రభుత్వ ఫలాలను పొందుతున్నాం. సీఎం జగన్‌కు ప్రజలు రుణపడి ఉన్నారు.

– బయపరెడ్డి, ఉదమలకుర్తి, తలుపుల మండలం

'శ్రీచైతన్య'కు అనుమతుల్లేవు

- నారాయణ స్కూలుకూ 7వ తరగతి వరకే

ప్రశాంతినిలయం: కొత్తచెరువులోని శ్రీ చైతన్య స్కూల్‌కు ప్రభుత్వ అనుమతులు లేవని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ఆపాఠశాలలో చేర్పించవద్దని ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే కొత్తచెరువులోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు కూడా 7వ తరగతి వరకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఆపై తరగతుల్లో విద్యార్థులను చేర్చరాదన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఇప్పటికే ఆయా స్కూళ్లలో విద్యార్థులను చేర్చిన వారు వెంటనే తమ పిల్లలను ఇతర పాఠశాలల్లోకి మార్చాలని సూచించారు.

బట్రేపల్లి వద్ద చిరుత సంచారం

తలుపుల: కదిరి–పులివెందుల రహదారిలో బట్రేపల్లి జలపాతం సమీపంలోని అటవీప్రాంతంలో శుక్రవారం రాత్రి రోడ్డుపై చిరుత కనిపించింది. వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి మేనల్లుడు దినేష్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాత్రి కారులో తలుపుల నుంచి కదిరికి బయలుదేరాడు. రాత్రి 8 గంటల సమయంలో బట్రేపల్లి అటవీ ప్రాంతంలోకి రాగానే రోడ్డుకు అడ్డంగా ఓ చిరుత వచ్చి నిల్చుంది. దీంతో దినేష్‌కుమార్ రెడ్డి కారును రోడ్డుపైనే నిలిపివేశాడు. అప్పుడే వర్షం కురవడంతో చిరుత అక్కడి నుంచి వెళ్లిపోయింది. నిత్యం వందలాది మంది ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే రోడ్డులో చిరుత సంచారం గురించి తెలియడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంతినిలయం: జిల్లాలో అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు, ప్రధానోపాధ్యాయులు 2023 సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు కనీసం 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలని సూచించారు. దరఖాస్తు కోసం https://nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'జగనన్న సురక్ష'కు విశేష స్పందన

- వివిధ పత్రాల కోసం 34,735 దరఖాస్తుల స్వీకరణ
- తొలిరోజు పంపిణీకి 5,443 ధ్రువీకరణ పత్రాలు సిద్ధం
- వారం రోజుల్లో 80 వేల ఇళ్లు సందర్శించిన అధికారులు



కుటాగుళ్ల సచివాలయ పరిధిలో జరుగుతున్న 'జగనన్న సురక్ష' సర్వే వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జిల్లాలో ఎక్కడైనా, ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందలేదనే ఫిర్యాదు రాకుండా ప్రజలకు అవసరమైన 11 రకాల సేవా సర్టిఫికెట్లు అందజేయడానికి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి కుటుంబాన్నీ పలకరిస్తున్నారు. జూన్ 24వ తేదీ నుంచి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుంటున్నారు. 'జగనన్న సురక్ష' తొలి విడతలో భాగంగా 6 రోజుల పాటు 149 సచివాలయాల పరిధిలో పనిచేసే 2,321 మంది వలంటీర్లు సచివాలయ ఉద్యోగులతో కలిసి 80,485 కుటుంబాలను సందర్శించారు. సమస్యల గురించి తెలుసుకుంటున్నారు. ఏవైనా సర్టిఫికెట్లు అవసరమా...అర్హత ఉండీ ఏదైనా సంక్షేమ పథకం అందలేదా అని ఆరా తీస్తున్నారు. ఎవరికైనా ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే అప్పుడే అందుకు కావాల్సిన పత్రాలు తీసుకుని సచివాలయాల్లో నమోదు చేస్తున్నారు. ఇలా ఇప్పటికే 34,735 టోకెన్లు రిజిస్టర్ చేసుకుని సేవా దరఖాస్తులు అందజేశారు. వాటిలో ఇప్పటి వరకూ 22,145 దరఖాస్తులను ఆయా సచివాలయాల్లో ఆన్‌లైన్ చేశారు.

నేటి నుంచి గ్రామ సభలు..

'జగనన్న సురక్ష' తొలి విడతలో భాగంగా జూన్ 24వ తేదీన సర్వే ప్రారంభించిన సచివాలయ పరిధిలో 1వ తేదీ (శనివారం) సురక్ష గ్రామ సభలు నిర్వహించనున్నారు. తొలి రోజు 42 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రారంభించగా అందులో 22,324 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో 16,289 ఆన్‌లైన్ రిక్వెస్ట్‌లు నమోదు చేశారు. అందులో 5,443 దరఖాస్తులను ఆమోదించి ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేశారు. మరో 10,839 దరఖాస్తులకు మరికొంత సమయం పడుతుందని నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తెలిపారు. సిద్ధం చేసిన ధ్రువీకరణ పత్రాలను సురక్ష సభల్లో లబ్ధిదారులకు అందజేయనున్నారు.

భారీగా నగదు పట్టివేత!

- కొడికొండ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న పోలీసులు
- రూ.1.15 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

చిలమత్తూరు: మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం భారీఎత్తున నగదు పట్టుబడింది! సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో పోలీసులు చెక్‌పోస్టు వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలోనే బెంగళూరు వైపు నుంచి వస్తున్న స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.1,15,48,500 నగదు పట్టుబడినట్లు హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. వాహనంలో గల వ్యక్తులు అనంతపురం జిల్లా ఆత్మకూరుకు చెందిన ధనుంజయరెడ్డి, ముత్యాలప్ప, ప్రదీప్‌కుమార్‌లుగా గుర్తించామన్నారు. పండ్లను విక్రయించి డబ్బు తీసుకొస్తున్నట్లు చెప్పారని, కానీ వారి వద్ద ఎలాంటి రసీదులూ లేకపోవడంతో ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన చెప్పారు. కాగా..నగదును ముందస్తు సమాచారం మేరకే పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం పోలీసులు పలువురు మఫ్టీలో చెక్‌పోస్టు వద్ద మకాం వేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ హడావుడిగా కన్పించారు. దీన్నిబట్టి చూస్తే ముందస్తు సమాచారం ఉన్నట్లుగా తెలుస్తోంది.

జిల్లాకు కొత్తగా నాలుగు పీహెచ్‌సీలు

మడకశిర: జిల్లాలో కొత్తగా నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) ఏర్పాటు కానున్నట్లు జిల్లా అదనపు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో కొత్తగా 87 పీహెచ్‌సీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. అందులో జిల్లాకు నాలుగు కేటాయించారన్నారు. దీంతో మోరుబాగల్, పెద్దమంతూరు, ఊటుకూరు, కోడూరుల్లో నూతన పీహెచ్‌సీలు ఏర్పాటు కానున్నాయన్నారు. ఆయా పీహెచ్‌సీలకు ఇద్దరు చొప్పున వైద్యులను కూడా ప్రభుత్వం నియమించినట్లు ఆమె వెల్లడించారు. నూతన పీహెచ్‌సీల భవన నిర్మాణాలకు ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్) ద్వారా రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మోరుబాగల్‌లో నూతన భవన నిర్మాణానికి స్థల సేకరణ కూడా పూర్తయ్యిందన్నారు. అలాగే మడకశిర నియోజకవర్గంలోని రత్నగిరి, మధూడిల్లో నూతన పీహెచ్‌సీల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మంజువాణి వెల్లడించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు

కదిరి టౌన్: ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వార్డులు, రక్త పరీక్ష కేంద్రం, లేబర్ గదులు, ఫార్మసీ, డయాలసిస్ యూనిట్, కాన్పుల గదులను పరిశీలించారు. రోజూ ఓపీ ఎంత వస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మిని ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారంతా నిరుపేదలేనని, వారికి సకాలంలో సేవలందించాలని సూచించారు. ఓపీ సంఖ్య పెంచాలని, రోగుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా సేవలందించాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలన్నారు. అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం కుటాగుళ్ల సచివాలయం–3ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఓ తిపేంద్ర నాయక్, తహసీల్దార్ నటరాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా భూతప్పల ఉత్సవం



భక్తులపై కాలు మోపుతూ ముందుకు వెళ్తున్న భూతప్ప



భూతప్పల పాదస్పర్శ కోసం వేచి చూస్తున్న భక్తులు

మడకశిర రూరల్: ఏకాదశి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని భక్తరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద శుక్రవారం మినీ భూతప్ప ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు మహిళలు భూతప్పల కాలిస్పర్శతో పునీతులయ్యారు. ఉదయం శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ఉపవాస దీక్ష, పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడుతున్నవారు, సంతానం లేని మహిళలు స్నానమాచరించి తడిదుస్తులతో భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద భూతప్పలు వచ్చేదారిలో పడుకున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చిన భూతప్పలు దారిలో పడుతున్న భక్తులపై కాలుమోపుతూ దేవాలయానికి చేరుకున్నారు. ఇలా భూతప్పలు కాలుమోపితే రోగాలు నయమై మహిళలకు సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. అనంతరం భక్తులు దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో పాల్గొనేందుకు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరాగా, భక్తరపల్లి జనసంద్రమైంది.

ప్రశాంతంగా బదిలీ ప్రక్రియ

అనంతపురం సిటీ: గ్రామ సచివాలయాల్లో పని చేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్ల రెండో విడత బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ జిల్లా కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ యమ్మాని భాగ్యరాజ్, ఈఈ మురళీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, రసూల్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 200 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కౌన్సెలింగ్‌కు తరలివచ్చారు. వారిలో 16 మందికి అంతర్ జిల్లాల బదిలీలు చేశారు. ముగ్గురికి మెడికల్ గ్రౌండ్ కింద బదిలీలు చేయగా, సుమారు 100 మందికి అనంతపురం జిల్లాలో బదిలీలు నిర్వహించారు. మరో 40–50 మందికి తాము కోరుకున్న చోట ఖాళీలు లేకపోవడంతో వారిని పాత స్థానాల్లోనే కొనసాగాలని సూచించారు. బదిలీలైన వారికి వెంటనే ఉత్తర్వులు కూడా అందజేశారు. జూలై ఒకటి నుంచి విధుల్లో చేరాలని ఆదేశించారు.



అనంతపురం పీఆర్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ భాగ్యరాజ్

ఇంట్లో చోరీ

ఉరవకొండ: మండలకేంద్రంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్ తెలిపిన మేరకు.. స్థానిక లక్ష్మీనృసింహస్వామి కాలనీలో ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్‌బాషా నివాసముంటున్నారు. బక్రీద్ పండుగ చేసుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 27న సొంతూరు పామిడికి వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి ఇంటికి రాగా, తలుపు తాళాలు పగులగొట్టిన స్థితిలో కనిపించాయి. బీరువాలోని రూ. 3 లక్షలతో పాటు 2 తులాల బంగారం కనిపించలేదు. బాధితుని సమాచారంతో పోలీసులు ఇంటిని పరిశీలించారు. క్లూజ్‌టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



బీరువాను ధ్వంసం చేసిన దొంగలు

ప్రొఫెసర్.. సేవలు సూపర్

అధ్యాపకుడిగా పనిచేస్తూనే తోటివారికి సేవ చేస్తున్నారాయన. సమాజానికి తనవంతు సహాయం అందించాలనే తలంపుతో స్నేహితులు, కుటుంబసభ్యుల సహకారంతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే వేలాది మంది జీవితాల్లో కంటి వెలుగులు నింపారు.

- పేదల సేవలో తరిస్తున్న ప్రొఫెసర్ కుమార్ రాజా
- కంటి వైద్య శిబిరాలతో ఆపన్నహస్తం
- ప్రభుత్వం నుంచి సాయం ఆశించకుండానే ముందుకు..



కంటి పరీక్షా క్యాంపులో రోగులను పరీక్షిస్తున్న శంకర కంటి ఆసుపత్రి వైద్యులు (ఫైల్)

హిందూపురం: పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ కుమార్ రాజా పని చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి 2017లో ట్రినిటి ట్రస్టును స్థాపించారు. సాధారణంగా స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ సహకారం ఆశిస్తాయి. ట్రినిటి స్వచ్ఛంద సంస్థ మాత్రం అలా చేయడం లేదు. కేవలం ట్రస్టులోని ఏడుగురు సభ్యులు తమ ఆదాయం నుంచి ప్రతి నెలా 10 శాతం సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తుండడం గమనార్హం. సభ్యులందరూ ఉద్యోగాలు చేస్తూ మంచి స్థాయిలో ఉండటంతో ఏటా సుమారు రూ.4 లక్షల దాకా సమకూరుతోంది. ఇలా వచ్చిన డబ్బుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

కంటి వైద్య శిబిరాలతో వెలుగులు..

హిందూపురం నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతం కావడంతో చాలామంది పేదలు కంటి సంబంధ జాగ్రత్తలు తీసుకోలేరు. ఫలితంగా చిన్న వయసులోనే అంధత్వానికి చేరువై బాధపడుతుంటారు. ఈ విషయాన్ని గుర్తించి ట్రినిటి స్వచ్ఛంద సంస్థ కంటి వైద్య శిబిరాలపై దృష్టి సారించింది. బెంగళూరు శంకర్ నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తోంది. ప్రతి నెలా మూడవ శని, ఆదివారాల్లో స్థానిక అల్‌హిలాల్ స్కూల్ యాజమాన్యం సహకారంతో శిబిరాలను నిర్వహిస్తున్నారు. వీరి కృషితో ఇప్పటి వరకూ సుమారు 16 వేల మంది జీవితాల్లో వెలుగులు నిండాయి. దీంతో పాటు తరచూ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్నారు. కళాశాలల్లో చదివే దివ్యాంగ విద్యార్థులకు దుస్తులు వితరణ చేస్తున్నారు. చదువులో రాణించే ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉన్నత చదువులకు ఉచిత సౌకర్యాలు కల్పిస్తున్నారు.

భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు



కంటి వైద్య శిబిరాలతో పాటు ప్రతిభావంత విద్యార్థులకు ఉన్నత చదువులు చదవడానికి సహాయం చేస్తున్నాం. భవిష్యత్తులో పేదల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడానికి కృషి చేస్తున్నాం. కంటి సంబంధ చికిత్సలు చేయించి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం.

– డాక్టర్ కుమార్‌రాజా, ట్రినిటి అధ్యక్షుడు, హిందూపురం

ఆనందం చెప్పలేము..



పేదలకు సేవ చేయడంలో ఎంతో ఆనందం లభిస్తోంది. ట్రినిటి సంస్థ ద్వారా ఆర్తులకు మా వంతు సహకారం అందిస్తున్నాం. బెంగళూరు శంకరా కంటి ఆసుపత్రి నిర్వాహకుల సహకారంతో కంటి ఆపరేషన్లు చేయించి తిరిగి స్వస్థలాలకు చేరుస్తున్నాం.

– ఉషారాణి, ట్రినేటి ఆర్గనైజేషన్ కార్యదర్శి

మా వంతు సహకరిస్తాం



పేదలకు కంటి సంబంధమైన సమస్యలు దూరం చేయడమే మా లక్ష్యం. అందుకే ట్రినిటి స్వచ్ఛంద సంస్థకు మా వంతు సహకారం అందిస్తున్నాం. ప్రతి నెలా వందలాది మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నాం.

– డాక్టర్ ఆర్‌వీ రమణి, శంకరా కంటి ఆస్పత్రి వ్యవస్థాపకులు, బెంగళూరు

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

లేపాక్షి: అత్యాచారం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ మునీర్‌అహమ్మద్ తెలిపిన మేరకు.. మండలంలోని బిసలమానేపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ఈ నెల 28న రాత్రి 10 గంటల సమయంలో తన ఇంటిపై పడుకుంది. ఆమె తల్లి, పిల్లలు ఇంట్లో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆదినారాయణప్ప కుమారుడు నగేష్ మహిళ ఇంటిపైకి వెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండుకు పంపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

లేపాక్షి: మండలంలోని విభూదిపల్లి గ్రామం సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పశువుల మేత కోసం పొలాల్లోకి వెళ్లిన రైతులకు దుర్వాసన రావడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయసు 50 సంవత్సరాలు ఉండవచ్చని అంచనా వేశారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఆత్మహత్య కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

గార్లదిన్నె: ఓ వ్యక్తి ఆత్మహత్య కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. హెడ్ కానిస్టేబుల్ చౌరెడ్డి తెలిపిన మేరకు.. 2015 సంవత్సరంలో ఉమాదేవి భర్త రవిశంకర్ తమ ఇంటిని పి.కొత్తపల్లికి చెందిన క్రిష్టారెడ్డి వద్ద రూ.2,70,000కు రిజిస్ట్రేషన్ ఆయకం చేయించుకున్నాడు. ఇల్లు విడుపించుకోమని క్రిష్టారెడ్డి బలవంతం చేయడంతో రవిశంకర్ పురుగుల మందు తాగి చనిపోయాడు. అప్పట్లో గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ వేశారు. శుక్రవారం అనంతపురంలో జడ్జీ దీనా విచారణ చేసి పి.కొత్తపల్లికి చెందిన కృష్టారెడ్డి, చలమావతికి మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు. మరో ముగ్గురిపై కేసు నిరూపణ కాకపోవడంతో విడుదల చేశారు.

మంత్రాలయం ప్యాసింజర్ రైళ్ల సేవలు పొడిగింపు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంతకల్లు–మంత్రాలయం ప్యాసింజర్ రైళ్ల సేవలను పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు–మంత్రాలయం (రైలు నం.07411) ప్యాసింజర్ ఈ నెల 10 వరకూ, మంత్రాలయం–గుంతకల్లు (07412) ప్యాసింజర్ 11వ తేదీ వరకూ రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూ (ఏ) ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ

- ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్‌గా సుజాత నియామకం
- వర్సిటీ పరిధిలో పలువురు ప్రొఫెసర్ల బదిలీ



ప్రొఫెసర్లు ఎస్వీ సత్యనారాయణ, ఏ. సురేష్ బాబు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ నియమితులయ్యారు. వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన ఆదేశాల మేరకు వర్సిటీ పరిధిలో పలువురు ప్రొఫెసర్లను బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ పి. సుజాత స్థానంలో కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణను నియమించారు.

మార్పు చేర్పులు జరిగిన ప్రొఫెసర్ల వివరాలివీ..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ	కలికిరి ప్రిన్సిపాల్	అనంతపురం ప్రిన్సిపాల్
ప్రొఫెసర్ ఎం. వెంకటేశ్వర రావు	కలికిరి ప్రొఫెసర్	కలికిరి ప్రిన్సిపాల్
ప్రొఫెసర్ ఏ. సురేష్‌బాబు	సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్	డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్
ప్రొఫెసర్ బి. ఈశ్వర్ రెడ్డి	అడ్మిషన్స్ డైరెక్టర్	రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్
ప్రొఫెసర్ పి. సుజాత	అనంతపురం ప్రిన్సిపాల్	ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్
ప్రొఫెసర్ ఆర్. కిరణ్మయి	ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్	అడ్మిషన్స్ డైరెక్టర్
ప్రొఫెసర్ సి. శోభాబిందు	రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్	డైరెక్టర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్
ప్రొఫెసర్ వీజీ చిత్ర	ఇంగ్లిష్ ప్రొఫెసర్	డైరెక్టర్, మహిళా సాధికారిత
ప్రొఫెసర్ ఆర్. భువన విజయ	డైరెక్టర్ మహిళా సాధికారిత	సైన్స్, హ్యుమానిటీస్ డైరెక్టర్
ప్రొఫెసర్ ఎం. నసీరా	కలికిరి ప్రొఫెసర్	వైస్ ప్రిన్సిపాల్, కలికిరి
ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి	ప్రొఫెసర్	వైస్ ప్రిన్సిపాల్, అనంతపురం
డాక్టర్ ఎస్. చంద్రమోహన్ రెడ్డి	ప్రొఫెసర్	అనంతపురం ఈసీఈ విభాగాధిపతి
డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి	అడిషనల్ కంట్రోలర్	అనంతపురం ఈఈఈ విభాగాధిపతి
డాక్టర్ జితేంద్ర గౌడ్	అడిషనల్ కంట్రోలర్	కలికిరి ఈఈఈ విభాగాధిపతి
బి. అజిత	అసిస్టెంట్ ప్రొఫెసర్	సివిల్ విభాగాధిపతి
డాక్టర్ జీ. శ్రీనివాసులు	ఈఈఈ విభాగాధిపతి	అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
డాక్టర్ జి. మురళి	ప్రొఫెసర్	పులివెందుల సీఎస్ఈ విభాగాధిపతి
డాక్టర్ ఎస్. జస్పికా సరిత	పులివెందుల సీఎస్ఈ విభాగాధిపతి	అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
ప్రొఫెసర్ ఆర్. భవానీ	అనంతపురం వైస్ ప్రిన్సిపాల్	పులివెందుల కళాశాలకు డిప్యుటేషన్
ఎస్. శ్రీధర్	అడిషనల్ కంట్రోలర్	కలికిరి కళాశాలకు డిప్యుటేషన్
ప్రొఫెసర్ ఎన్. విశాలి	ఈఈఈ విభాగాధిపతి	కలికిరి కళాశాలకు డిప్యుటేషన్
డాక్టర్ డీ.ఆర్. శ్రీనివాసన్	మెకానికల్ ప్రొఫెసర్	కలికిరి కళాశాలకు డిప్యుటేషన్
డాక్టర్ కే. అపర్ణ	ప్రొఫెసర్	కలికిరి ఈసీఈ విభాగాధిపతి

గడులోపు రీసర్వే పూర్తి చేయాలి

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' పథకం కింద జిల్లాలో చేపట్టి రీ సర్వే గడువులోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో రీసర్వేపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, డీఐఏలు, డివిజన్, మండల, సచివాలయ సర్వేయర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ చేతన్ పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణతో కలిసి మాట్లాడారు. జిల్లాలో మూడు విడతలుగా 210 గ్రామాల్లో రీ సర్వే చేపట్టామన్నారు. తొలి విడతలో 26 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. ఆయా గ్రామాల్లో 13 నోటిఫికేషన్ కూడా ఇచ్చామన్నారు. రెండో విడతలో 59 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించగా, 14 గ్రామాలోల 13 నోటిఫికేషన్ ఇచ్చామని వెల్లడించారు. మూడో విడతలో 125 గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో పనులు వేగవంతం చేయాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో వీఎస్ఏ లాగిన్, వీఆర్ఓ, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్, జేసీ లాగిన్‌లలో ప్రొఫార్మా ప్రకారం వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. కేటగిరీ వారీగా పట్టా భూమి, అసైన్డ్ భూమి, దేవదాయ శాఖ భూమి తదితర వివరాలకు సంబంధించిన ల్యాండ్ పార్సిల్ నంబర్లు వేర్వేరుగా కేటాయించాలని సూచించారు. మ్యుటేషన్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలన్నారు. రీ సర్వేలో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు తిప్పేనాయక్, రాఘవేంద్ర, రీ సర్వే డీటీ క్రాంతి, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎండిన ద్రాక్ష తిని 20 గొర్రెల మృత్యువాత

గార్లదిన్నె: తోటలో ఎండిన ద్రాక్ష తిని 20 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన మండల పరిధిలోని తిమ్మంపేట సమీపంలో చోటుచేసుకుంది. పశువైద్యాధికారి రమేష్ తెలిపిన మేరకు.. రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన బిల్లే శ్రీరాములు తన 300 గొర్రెలను మేపు కోసం గార్లదిన్నె మండలం తిమ్మంపేటకు తీసుకొచ్చాడు. శుక్రవారం ఉదయం స్థానికంగా ఉండే ఓ తోటలో ఎండిన ద్రాక్షలను గొర్రెలు తిన్నాయి. కొంతసేపటికి నీరు తాగి కడుపు ఉబ్బరంతో పడిపోయాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి రమేష్ తన సిబ్బందితో హుటాహుటిన వెళ్లి కొన ఊపిరితో ఉన్న దాదాపు వంద గొర్రెలకు సెలైన్ బాటిళ్లు ఎక్కించారు. ఈ క్రమంలోనే 20 గొర్రెలు ప్రాణాలు విడిచాయి. దీంతో దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. కళేబరాలను గొర్రెల, మేకల కార్పొరేషన్ చైర్మన్ నరసింహ గౌడ్, జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. బాధిత రైతును ఓదార్చారు. నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.



గొర్రెలకు మందు తాపుతున్న వైద్యాధికారి డాక్టర్ రమేష్



మృతి చెందిన గొర్రెలు

పండ్ల తోటలు సాగు చేయండి

- పీడీ రామాంజనేయులు



గుంతలను పరిశీలిస్తున్న పీడీ రామాంజనేయులు

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీడీ రామాంజనేయులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో రైతు సాకే నారాయణమ్మ తోటను ఆయన పరిశీలించారు. రైతుతో మాట్లాడారు. ఏ విధంగా నాటుకోవాలి, ఎంత మేర గుంతలు తీసుకోవాలి తదితర విషయాలను వివరించారు. పండ్ల తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులు ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబయ్య, టీఏ నాగేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి



మృతి చెందిన సరిత

సోమందేపల్లి: నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని సాయినగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నగేష్, విజయ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం ఇంటి ముందు బట్టలు ఉతకడానికి బకెట్ నిండుగా నీళ్లు పెట్టి విజయ లోపలికి వెళ్లింది. ఈ క్రమంలోనే చిన్నారి సరిత (2) ప్రమాదవశాత్తు బకెట్లో పడిపోయింది. కొద్దిసేపటికి గమనించిన తల్లి చిన్నారిని బయటకు తీయగా.. అప్పటికే ప్రాణాలు విడిచింది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

సీఆర్టీ ఉద్యోగాలకు నైపుణ్య పరీక్ష రేపు

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఈనెల 2న అభ్యర్థులకు నైపుణ్య పరీక్ష (స్కిల్ టెస్ట్) ఉంటుందని సమగ్ర శిక్ష ఏపీసీ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1:3 ప్రకారం ఎంపికై దరఖాస్తుల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాల్సి ఉంటుదని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో అనంతపురంలోని రాజేంద్ర మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2.30 గంటలకు నైపుణ్య పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. పీజీటీ (పీఎస్‌టీటీ), పీజీటీ (ఏటీఅండ్‌టీ), పీజీటీ (జీఎఫ్‌సీ), పీజీటీ (ఎంఎల్‌టీ), పీజీటీ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) సబ్జెక్టుల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.